# తస్మాత్ జాగ్రత్త!

రోజూ కన్నా ముందుగానే, ఆ రోజు శౌనకాది మునులందరూ నైమిశారణ్యంలో నది ఒడ్డున ఆసీనులయారు.

అక్కడ మర్రిచెట్టు ఊడలు పట్టుకుని ఊగుతున్నది ఒక కోతి పిల్ల. ఒక చోటు నించి ఇంకోచోటుకి ఊడలు పట్టుకుని అరుచుకుంటూ ఎగురుతుంటే చూట్టానికి బాగానే వుంది కానీ, తల్లి కోతికి అది చూసి గుండెల్లో దడ ప్రారంభమయింది.

సూత మహాముని స్నానానంతరం అక్కడికి వచ్చి, అందరి దృష్టి కోతిపిల్ల మీదే వుండటం వల్ల, తనూ అటే పరికించి చూశాడు.

ఆ కోతిపిల్ల ఎగిరి ఇంకో ఊడను పట్టుకోబోయి చేయిజారి కింద పడబోయింది.

మునిపుంగవులందరూ "అరెరె" అని మానవభాషలో అంటే సర్వ జంతుజాలమూ అదే మాటని వారి వారి భాషల్లో అని, తమ ఆందోళనని వ్యక్తం చేశాయి.

ఈలోగా జారిన కోతిపిల్ల భూమిమీద పడబోయే సమయంలో ఇంకొక పెద్దకోతి ఒడుపుగా దాన్ని పట్టుకుంది. అది చూస్తున్న తల్లికోతి గుండెలు ఇంకోసారి దడదడలాడినా, తన పిల్లకి ఏమీ కానందుకు సంతోషించింది.

అక్కడ వున్న అందరూ ఒక్కసారిగా చప్పట్లు కొట్టారు.

రచ్చబండపై కుదురుగా ఆసీనుడయిన సూతమహాముని వేపు ఒకసారి చూసి, చిన్నముని ఇలా అన్నాడు.

"ఈ మధ్య చాల మంది భారతీయులు, హెచ్ వన్ వీసా మీద అమెరికా వెడుతున్నారు కదా, మరి వాళ్ళక్కడ ఎలా వుంటున్నారు? సుఖ పడుతున్నారా? ఇబ్బందులకు లోనవుతున్నారా? వీసాలు ఉద్యోగాలూ ఇప్పించే ఏజన్సీలు వీళ్ళనేమీ మోసం

చేయకుండా సహాయం చేస్తున్నాయా? ఇందాక కోతిపిల్లని చూశాం కదా ఎలా క్రింద పడబోయిందో. అలా పడకుండా వుండటానికి మీరు వాళ్ళకి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందో చెబితే, అమెరికావెళ్ళే అలాటివారికీ కథలు వినే మాలాటి వాళ్ళకీ బాగుంటుంది కదా" అన్నాడు.

శుకమహర్షి చిన్నగా నవ్వి "మంచి కోరికే కోరావ్ నాయనా. కొత్తగా అమెరికా వెళ్ళే వారి కోసం, ఇండియాకి అమెరికాకీ మధ్య సాంస్కృతికంగానూ, సాంఘికంగానూ వున్నవ్యత్యాసాలూ అక్కడ ఎలా ప్రవర్తించాలి ఎలా మాట్లాడాలి అనే విషయాలు "అమెరికా బేతాళుడి కథల్లో" చదివాం కదా. కాకపోతే ఈ కథలో హెచ్ వన్ వీసాల మోసాల భాగోతం గురించి కొంచెం మాట్లాడుకుందాం. అదేదో ఉపన్యాసం లాగానో, వ్యాసం లాగానో చెబితే కించిత్తు బోరు కొట్టే అవకాశం వుంది. అందుకని సూతమహాముని ఆ కబుర్లని ఒక కథలాగా చెబితే బాగుంటుందని నా సదుద్దేశ్యం" అన్నాడు తన ఉద్దేశ్యం చెబుతూ.

సూతుడు ఆ మాట విని మందహాసం చేశాడు. "మీరు చెప్పింది సమంజసంగానే వుంది శుకమహర్షీ! ఈరోజుకి అలానే కానిద్దాం..." అన్నాడు.

కథ వినటానికి అందరూ సర్దుకుని కూర్చున్నారు.

సూతుడు కొన్ని క్షణాలు మౌనం వహించాడు.

కోతిపిల్ల అమ్మ ఒడిలో వెచ్చగా కూర్చున్నది కథ వినటానికి సిద్ధమయి.

సూతుడు ఒకసారి గొంతు సర్దుకుని, కథ చెప్పటం ప్రారంభించాడు.

"నేను చెప్పబోయే కథ ఇప్పుడు భారతదేశంలో జరుగుతున్న సంఘటనలని ఆధారంగా చేసుకుని చెప్పేదే. కల్పన కాదు" అని ఇండియా వేపు దృష్టిని సారించాడు.

"ఈమధ్య శెలవు పెట్టి, అమెరికా నించి ఇండియా వచ్చిన శంకర్రావు తన స్వంత ఊరు విశాఖపట్నంలో దిగిన మర్నాడే వాళ్ళింటికొచ్చాడు శేషగిరి అనే ఒక కుర్రాడు.

"మీరు వస్తున్నారని తెలిసి, మిమ్మల్ని కలవాలని మీకోసం ఎదురు చూస్తున్నాను. పది నిమిషాలు మీతో మాట్లాడవచ్చా?" సౌమ్యంగా అడిగాడు.

"అయ్యో అదేమిటి. ఏమీ ఫరవాలేదు. కూర్చోండి" అని అతన్ని మర్యాద చేసి కూర్చోబెట్టాడు శంకర్రావ్.

"ఏంలేదు. మిమ్మల్ని ఒక సలహా అడుగుదామని వచ్చాను"

శంకర్రావ్ నవ్వి "అడగండి. నాకు తెలిసిందేదో చెబుతాను" అన్నాడు.

ఒక్కక్షణం తటపటాయించి, శేషగిరి నెమ్మదిగా "నాకు అమెరికా వెళ్ళాలని వుంది. ఎలా వెళ్ళచ్చో చెబుతారా?" అని అడిగాడు.

బస్ స్టాండ్‌కి వెళ్ళాలి, ఎలా వెళ్ళాలో చెబుతారా అని బస్ స్టాండ్‌కి దారి అడిగినంత తేలికగా అడిగాడు అతను. అందుకే శంకర్రావుకి నవ్వు వచ్చిందికానీ సభ్యత కోసం ఆపుకుని అతన్ని అడిగాడు.

"మీరు అమెరికా దేనికి వెళ్దామనుకుంటున్నారు. పై చదువులకా, విజిటర్‌గానా? ఉద్యోగానికా? దానిబట్టి వుంటుంది వెళ్ళటానికి వీలవుతుందో లేదో"

శేషగిరి శంకర్రావుని అదోరకంగా చూసి, మౌనంగా వూరుకున్నాడు.

ఒక్కక్షణం ఆగి శంకర్రావే అన్నాడు "ఫర్ ఎగ్జాంపుల్.. నేను ఇంజనీరింగ్‌లో మాస్టర్స్‌డిగ్రీ చేయటానికి అమెరికా వెళ్ళాను. అక్కడ అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ చేయటంకోసం వెళ్ళటం కష్టం. కాకపోతే మాస్టర్స్ డిగ్రీకి కానీ పిహెచ్‌డికి కానీ అయితే అవకాశాలు బాగానే వుంటాయి. కానీ దాని కోసం ముందుగా జిఆర్ఇ, టోఫెల్ పాసవాలి. మీరు వాటిల్లో ఎలా చేశారన్నదాన్ని బట్టి మీకు ఎడ్మిషన్ కానీ, అసిస్టెంట్ షిప్ కానీ, స్కాలర్‌షిప్ కానీ రావటం"

అతని మాటలకు అడ్డం వస్తూ అన్నాడు శేషగిరి. "లేదు. నేనవేమీ అనుకోవటం లేదు. మీ ఇంట్లోకి వస్తున్నప్పుడు చూశాను. జామచెట్టు. ఆ జామచెట్టుకిఎన్నికాయలు కాస్తున్నాయో ప్రతి సంవత్సరం ఇక్కడ అన్నిప్రైవేటు కాలేజీలు వెలుస్తున్నాయి. ఇక్కడ ఎంట్రన్స్ పరీక్షల్లో గొప్పరాంక్ వచ్చినా, ఎడ్మిషన్లు రావటం అంత సులభం కాదు. అంతేకాదు, ఈ కాలేజీల్లో మంచివీ వున్నాయి చెడువీ వున్నాయి. నేను మాట్లాడుతున్నది మంచి కాలేజీలు కాని కాలేజీల గురించి"

"అంటే?" అర్థం కాలేదు శంకర్రావ్‌కి.

"అంటే ఇప్పుడు చదువు ఒక పెద్ద వ్యాపారం అయిపోయింది. పూరి గుడిసెల్లోనో, ఏమీ ఫెసిలిటీస్ లేని బిల్డింగులలోనో వున్నాయి కొన్నికాలేజీలు. అలాటి కాలేజీల్లో కొన్నిట్లో సబ్జెక్ట్ తెలిసిన లెక్చరర్లు కూడా లేరు. అంతే కాదు, వాటిల్లో కావలసిన ఎక్విప్‌మెంట్ కానీ, లైబ్రరీలు కానీ లేవు. ఎన్నో లంచాలిచ్చి, ఎంతో ఖర్చుపెట్టి ప్రారంభించిన ఆ కాలేజీలు, స్టూడెంట్లకి డొనేషన్ కాని డొనేషన్‌తో, ఎడ్మిషన్లిచ్చి, చదువుకి మాత్రం ఏమీ ప్రాధాన్యం ఇవ్వటం లేదు. అలాటి కాలేజీలో చదువుతున్నాన్నేను. ఇప్పుడు మా కాలేజీ స్ట్రైక్‌లో వుంటే ఈ వూరు వచ్చి మీ దగ్గరకి వచ్చాను"

"డిగ్రీ పూర్తయిందా?" అడిగాడు శంకర్రావ్.

"లేదు. ఇంకో సంవత్సరంలో వస్తుంది. కాకపోతే ఇంతవరకూ ఒక్క సబ్జెక్ట్‌లోనూ మంచి కోచింగ్ ఇవ్వలేదు మా కాలేజీలో... "

"ఎందుకని?"

"చాలమంది స్టూడెంట్సుకి కావలసింది డిగ్రీలు మాత్రమే. కాలేజీ యాజమాన్యానికి కావలసింది వాళ్ళ పెట్టుబడి మీద లాభం. చదువు కాదు. మరి ప్రభుత్వానికే ఏం కావాలో తెలియటం లేదు!"

"మరి అలాటి విద్యార్థులు ఉద్యోగంలో చేరితే ఎలా పని చేస్తారు. అసలేం చేయగలరు.. "

అదోలా నవ్వాడు శేషగిరి. "మనకి అంత ముందు చూపే వుంటే, మనమూ మన దేశమూ, ఏనాడో బాగుపడుండే వాళ్ళం"

"అయితే నువ్వేం చేద్దామనుకుంటున్నావ్?"

"అదే మిమ్మల్ని సలహా అడుగుదామని వచ్చాను" అన్నాడు శేషగిరి. అతని గొంతులో ఎంత నిరాశ వుందో, అంత ఆశ కూడా వుంది.

అదే రకం ఆశ ముప్ఫై సంవత్సరాల క్రితం తన మనసులోనూ తళుక్కుమన్నది. అందుకే శంకర్రావ్‌కి అతనికి చేతనయిన సహాయం చేయాలనిపించింది.

"శేషగిరీ! ఇండియా, అమెరికా భూగోళానికి ఇటూ అటూ వున్నాయి. అలాగే ఉద్యోగాల్లోను ఉత్పత్తిలోనూ కూడా అంతే తేడా వుంది. ఉదాహరణకి ఇండియాలో ప్రభుత్వరంగంలో ఉద్యోగాలెక్కువ. అమెరికాలో ప్రైవేటురంగంలో ఉద్యోగాలెక్కువ. ఇక్కడ ప్రభుత్వరంగంలో డిగ్రీలు వుంటే చాలు. వృత్తిపరమైన నైపుణ్యం, నేర్పు లేకపోయినా ఫరవాలేదు. కులాల పేరుతో, మతాల పేరుతో,బంధు ప్రీతితోఉద్యోగాలిస్తారు. అక్కడలా కాదు. అమెరికా పెద్ద కాపిటలిస్టు దేశం. నువ్వు ఉద్యోగంలో ఏం చేయగలవు నీ వల్ల ఆకంపెనీకి ఎంత లాభం అనే చూస్తారు. నీ జాతి మతం కులం డిగ్రీలతో సంబంధంలేదు. అందుకే ఇండియానించి వెళ్ళిన వాళ్ళు, మంచి పనిమంతులయితే, పారిశ్రామిక రంగంలో పైకి వెడుతున్నారు. ఇవన్నీ నేను ఒక దేశం గొప్పదనీ, ఇంకోటి కాదనీ చూపించటం కోసం చెప్పటం లేదు. రెండిటికీ వున్నతేడాలను చూపిస్తున్నాను. అంతే!" అన్నాడుశంకర్రావ్.

"కానీ ఇక్కడా పరిస్థితులు మారుతున్నాయి. నరసింహారావ్, మన్‌మోహన్ సింగ్‌లు చూపించిన దారినే నడుస్తున్నాయి, బి.జె.పి, కాంగ్రెస్, తెలుగుదేశం. ఏ పార్టీ అయినా..."

"అవును వాళ్ళే కాదు. గొప్ప కమ్యూనిస్టునని చెప్పుకునే జ్యోతిబాసు కూడా అమెరికా వచ్చి కాపిటలిస్టుల కాళ్ళ మీద పడ్డాడీ మధ్య, తన బెంగాల్‌కి వచ్చి పరిశ్రమలు స్థాపించమని.. "

శేషగిరి కూడా నవ్వాడు.

"ఇదేదో గమ్మత్తుగా వుంది గురువుగారూ. కమ్యూనిస్టులు కాపిటలిస్టులయి పోవటం..." అన్నాడు చిన్నముని హాశ్చర్యపోతూ.

శౌనకుడు విసుక్కున్నాడు పక్కనే వున్ననేతి బీరకాయ చెట్టుని చూస్తూ.

సూతుడు చిన్నమునిని సాదరంగా చూసి, తన కథ కొనసాగించాడు.

శంకర్రావ్ అన్నాడు శేషగిరితో "అవును. మన దేశంలోకూడా ఈమధ్య ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు ఎక్కువవుతున్నాయి. కానీ జనాభా విపరీతంగా పెరిగిపోవటం లేదూ. చాలినన్ని ఉద్యోగాలు లేకనే కదా, ఏటా లక్షల్లో మనవాళ్ళు విదేశాలకి వెళ్ళిపోతున్నది"

శేషగిరి తలవూపాడు, మాయాబజార్ సినిమాలో ఏమిటి మన తక్షణ కర్తవ్యం అన్న డైలాగ్ తన ముఖంలో చూపిస్తూ.

"అమెరికా వెడితే అక్కడ ఏం చేస్తావ్?" అడిగాడు శంకర్రావ్.

"నేను చేరింది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్స్‌లో..."

"అయితే జావా, వెబ్ డిజైన్, హెచ్ టీ ఎమ్మెల్, విజువల్ బేసిక్ లాటివి చేయగలవా?"

శేషగిరి అన్నాడు "చెప్పాను గదా. మా కాలేజీలో అవి తెలిసిన స్టాఫ్ లేరని. ఇక మాకేం తెలుస్తాయి అవి"

శంకర్రావా జవాబుకి బిత్తరపోయాడు. ఒక్కక్షణం ఆలోచించి అన్నాడు. "నీకు ఒక కథ చెబుతాను. అమెరికాలో నిజంగా జరిగిన కొన్ని సంఘటనలని ఆధారంగా చేసుకుని చెబుతున్న కథ. జాగ్రత్తగా విను. ఒకతను నువ్వు చెప్పినటువంటి కాలేజీలోనే డిగ్రీ కోసమే డిగ్రీ సంపాదించుకుని, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాముల్లో మిడిమిడి జ్ఞానం మాత్రమే సంపాదించుకుని, అమెరికా వెళ్ళటానికి సిద్ధమయాడు. ఇలాటి విషయాల్లో, నీకు సహాయం చేయటానికి ఎంతమంది సిద్ధమవుతారో, అలాగే నిన్ను మోసం చేసి డబ్బు గుంజటానికి అంతకన్నా ఎక్కువమందే ఎదురు చూస్తుంటారు. హైద్రాబాద్‌లోని అలాటి ఒక ఏజెన్సీ అతని దగ్గర మూడు లక్షల రూపాయలు తీసుకుని, అతనికి అమెరికాలో ఉద్యోగం ఇప్పించామని చెప్పి హెచ్.వన్. వీసా ఇప్పించింది. అమెరికా వెడుతున్నాడు కనుక కట్నాల మార్కెట్లో అతని ధర పెరిగి, ఆకాశాన్నంటింది. తెలుగుదేశంలో పెళ్ళికూడా వ్యాపారమే కనుక అతని ఖరీదు డెభై లక్షల దాకా పలికింది. రెండు నెలల్లో అతనూ, అతని ఖరీదైన ఇల్లాలూ, అమెరికాలో ఒక పెద్ద సిటీలో కుడిపాదం పెట్టారు. అప్పుడే తెలిసింది అతనికి, అక్కడ నిజంగా ఒక ఉద్యోగమంటూలేదనీ, అతన్ని అక్కడ బెంచీ మీద కూర్చోబెట్టారనీ. బెంచీ మీద కూర్చోబెట్టటమంటే, అతన్నిస్పాన్సర్ చేసిన ఏజె

న్సీ అతని సి.వీ.ని (రెస్యూమేని) కొన్ని కంపెనీలకి పంపించి ఇంటర్వ్యూలు ఇప్పిస్తుందని, మనం "ఆరోకలికాలం" అనే ఎన్నారై కథలో చెప్పుకున్నాం కదా. అతనికి ఉద్యోగం వస్తే, అతను పని చేసే ప్రతిగంటకీ ఇచ్చే జీతంలో దాదాపు ముప్పైశాతం ఆ ఏజెన్సీ తీసుకుంటుంది. డబ్బుల కోసమే వీసాలు ఇప్పించే కొన్ని కంపెనీలు, ఇలాటివారు అమెరికా రాగానే వీళ్ళ గురించి పట్టించుకోవటం మానేస్తాయి కూడాను. ఏది ఏమైనా, కొత్తగా పెళ్ళయిన అతనూ, ఆమే, చౌకలో ఒక ఎపార్ట్‌మెంటు అద్దెకు తీసుకుని, ఇంటి దగ్గర నించీ తెచ్చుకున్న కాసిని డబ్బులూ వదిలించుకుని, రెండు నెలలు గడిపారు. ఏవో ఒకటి రెండు ఇంటర్వ్యూలకి వెళ్ళినా అతనికి ఉద్యోగం రాలేదు. చివరికో ఒక కంపెనీలో వెబ్ డిజైనర్‌గా జాబ్ వచ్చింది. తమ కష్టాలన్నీ గట్టెక్కాయని అతనూ ఆమే సంతోషించారు. కానీ ఆ సంతోషమంతా అతను ఉద్యోగంలో చేరిన మూడో రోజే అంతరించింది. ఇలాంటి ఉద్యోగుల్ని టెంపరరీగా కాంట్రాక్ట్ బేసిస్ మీద గంట జీతానికి తీసుకుంటారు కనుక, వేరే ట్రైనింగ్ ఏమీ ఇవ్వరు. అంతేకాక చేరిన మొదటి రోజునించీ పనిచేయాలని ఎదురు చూస్తారు. ఇతనికి మొదటి రోజునే ఒక ముఖ్యమైన పని ఇచ్చి, రెండో రోజు దాకా మొదలు పెట్టకపోయేసరికి అనుమానం వచ్చి మూడో రోజు పొద్దుటి దాకా ఏమీ ముందుకు నడవకపోవటంతో, సాయంత్రం అతన్ని ఇంటికి వెళ్ళిపొమ్మనీ, మర్నాడు మళ్ళీ రానక్కర్లేదనీ చెప్పారు... "

"అన్యాయం కదూ!" అన్నది బవిరిగేదె పక్కనే బద్ధకంగా పడుకుని, దవడల్లో దాచిన గడ్డిని నెమ్మదిగా నెమరేస్తూ.

"అన్యాయమేముంది. ఒక పని చేయటానికి అతనికి ఉద్యోగమిచ్చారు. ఆ పని సవ్యంగా చేస్తుంటే, అతని ఉద్యోగం నిలుస్తుంది. జీతం వస్తుంది. మరి ఊరికే కూర్చోబెట్టి డబ్బులివ్వటానికి, అదేమీ ఉచిత భోజనం పెట్టే సత్రం కాదు కదా. పెద్ద పెట్టుబడి పెట్టి ప్రారంభించిన పరిశ్రమ మరి" అన్నది చెట్టు మీద రామచిలుక, ఎంతో కష్టపడి తన పిల్లలకోసం సంపాదించిన ఆహార పదార్థాలని గూటిలో దాచి పెడుతూ.

"అసలు కథకి అడ్డు రాకండి మీరు" అన్నాడు చిన్నముని అసహనంగా.

సూతుడు చిరునవ్వి కథ కొనసాగించాడు.

"అతనికి మళ్ళీ ఏ ఉద్యోగం దొరకలేదు. ఇండియాలో తమ వాళ్ళందరూ అతని అమెరికా జీవితం గురించి గొప్పగా అనుకోవటం వల్ల, ఇంటినించి డబ్బు తెప్పించుకోటానికి అతనికిగానీ ఆమెకిగానీ మనసొప్పలేదు. చేతిలో డబ్బులేమీ లేకపోవటంతో అతను అక్కడే వున్న ఒక ఇండియన్ రెస్టారెంట్లో, వంటింట్లో సహాయం చేయటానికి, ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంట్ వాళ్ళకి తెలియకుండా ఉద్యోగంలో చేరాడు. కూరలు తర

గటం, గిన్నెలుకడగటం, రెస్టారెంటు మూసేసిన తర్వాత అంతా ఊడిచి శుభ్రం చేయ టంలాటి పనులు చేసి, నెమ్మదిగా నిలదొక్కు కుంటున్నారు. అప్పుడే మొదలయింది ఆ అమ్మాయి మనసులో క్షోభ. ఒక విధమైన డిప్రెషన్. డెభై లక్షలు కట్నమిచ్చి అతన్ని పెళ్ళాడిన ఆ అమ్మాయి ఆశించిన జీవితం కాదది. కలవారు కన్న కన్నె పిల్లగా కన్న కల లేవీ తీరక పోవటమే కాక, కలలోకూడా ఎన్నడూ ఊహించని అలాటి పేద జీవితా న్ని గడపలేకపోయింది. ఇద్దరికీ ఇండియాకి తిరిగి వెళ్ళిపోవటానికి కానీ, కనీసం కొంత డబ్బు తెప్పించుకోటానిక్కానీ ముఖం చెల్లలేదు. అలాగే ఎంతో సుఖపడుతుందని, అంత డబ్బు ఖర్చు పెట్టి తనకి పెళ్ళిచేసిన తల్లిదండ్రుల్ని నిరుత్సాహపరచలేకపోయింది. చాలీ చాలని డబ్బుతో కొన్నాళ్ళు కాలం గడిపారు" చెప్పటం ఆపాడు శంకర్రావ్.

ఒక్క క్షణం ఆగి, మౌనం భరించలేక "తర్వాత ఏమయింది?" అని అడిగాడు శేష గిరి.

"ఈ కథకి ముగింపు చెప్పటానికి నాకు మనసొప్పటం లేదు. అయినా ఇలాటి జరుగుతున్న కథలు చెప్పటం నా బాధ్యతగా భావించి చెబుతున్నాను. ఒక ఆదివారం ఆ సిటీలోని నా స్నేహితుడితో ఫోన్‌లో మాట్లాడుతుంటే అతనుచెప్పినది ఇది. వాళ్ళ ఇంటికి దగ్గర్లోవున్న అపార్టుమెంట్ కాంప్లెక్స్‌లో జరిగిన ఘోరమది. ప్రొద్దున్నే అపార్టు మెంట్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్ పూల్‌లో తేలిన రెండు శవాలని చూసి ఎవరో పోలీసు ల్ని పిలిచారుట. చివరికి తేలిందేమిటంటే, వాళ్ళిద్దరూ ఇక ఆ నిర్భరజీవితం భరించలేక, అర్ధరాత్రి, పన్నెండు అడుగులు లోతు వున్నస్విమ్మింగ్ పూల్ అడుగున, ఇద్దరూ కావ లించుకు కూర్చుని మునిగిపోయి, ఆ నీళ్ళల్లో అలాగే మరణించారని. వాళ్ళ చావుకి ఎవరూ బాధ్యులు కారనీ, ఆ దుర్భర జీవితాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుంటు న్నామనీ వ్రాశారు కూడాను..."

శేషగిరి భయం భయంగా చూశాడు. "అంతపని చేశారా" అన్నాడు తేరుకుని.

"అవును. నేనూ నమ్మలేదు. కానీ పోలీసులు ఇండియా అసోషియేషన్‌వాళ్ళతో మాట్లాడారనీ, వాళ్ళందరూ తర్వాత కార్యక్రమంగురించి ఆలోచిస్తున్నారనీ చెప్పారు"

శేషగిరి కుర్చీలోనించి లేచి, అసహనంగా అటూఇటూ తిరిగాడు. "వాళ్ళ సమస్య కి అది పరిష్కారం అని నేననుకోను. ఆ సమస్యని ఆ రకంగా కాకుండా, ఇంకా ఎన్నో రకాలుగా పరిష్కరించుకోవచ్చు అంటాను నేను" అన్నాడు.

శంకర్రావ్ లేచి, అతని భుజంమీద చేయివేసి అన్నాడు. "అవును. నేనూ అదే అంటు న్నాను. అసలు నేనీకథ చెప్పింది, నీలాంటి వాళ్ళని భయపెట్టటానికి కాదు. నీకూ, నీ లాటివారికీ, నిజంగా జరుగుతున్న విషయాలనీ, మోసాలనీ చూపిద్దామని. అమెరికా

లో జీవితం, అందంగానూ వుంటుంది. భయంకరంగానూ వుంటుంది. ఆనందంగా వుంటుంది. దుర్భరంగానూ వుంటుంది. అన్నిదేశాల్లాటిదే అమెరికా కూడా. అదొక భూతల స్వర్గం కాదు. స్వర్గం, నరకం అన్నవి ఎక్కడోలేవు. మన జీవితాలని ఏవిధంగా తీర్చిదిద్దుకుంటున్నామన్నదాన్ని బట్టి మనతోనే, ఇక్కడే వున్నాయి. కానీ ప్రదేశాన్ని బట్టి కాదు. పరుగుపందాల్లో గెలవాలనుకునే వాడు వేగంగా పరుగెత్తటం నేర్చుకోవాల్సిందే. అంతే కాదు, అందరికన్నా ముందరే పరుగెత్తటానికి ప్రయత్నించాలి. అలా పరుగెత్తలేనివాడు, పరుగెత్తే శక్తి వచ్చే దాకా పందాల్లో పరుగెత్తకూడదు. ఆ పరుగెత్తే శక్తికోసం ఎంతో కష్టపడి కృషి చేయాలి. అలాగే పరుగెత్తటం ఇష్టంలేనివాడు అసలుఆ ఛాయలకే వెళ్ళకూడదు"

శేషగిరి ఆలోచిస్తున్నాడు.

అతనికి ఉత్సాహం కలిగిస్తూ అన్నాడు శంకర్రావ్. "శేషగిరీ! నేనొక సలహా చెబుతాను. సాయంత్రం రామకృష్ణా బీచికి వెళ్ళు. ప్రశాంతంగా సముద్రాన్నిచూస్తూ, ఒక్కడివే కూర్చుని ఆలోచించు. అసలు నువ్వు జీవితంలో ఏంచేద్దామనుకుంటున్నావ్. నీకు జీవితంలో కావల్సిందేమిటి. అక్కడినించీ ప్రారంబించు భవిష్యత్తు గురించి నీ ఆలోచనలు. అంతేకానీ అమెరికాకి వెళ్ళటం అనే చోటునించీ కాదు. ఒకవేళ అమెరికా వెళ్ళటమే నీ లక్ష్యమయితే అందులో తప్పేమీ లేదు. కాని నేనిందాక చెప్పానే, పరుగు పందేల్లో గెలవాలన్నా కనీసం పాల్గొనాలన్నా పరుగెత్తే శక్తి వుంటేనే పాల్గొనమని. కాలేజీల్లో సరిగ్గా పాఠాలు చెప్పకపోతే, బయట వేరే మంచి సాఫ్టవేర్ కోర్సుల్లో నేర్చుకో. పుస్తకాలు కొనుక్కుని ఇంటి దగ్గర చదువుకో. వాటిల్లో మంచి ప్రావీణ్యం సంపాదించు. ఈ మధ్య ఆప్టెక్ వైస్ ప్రెసిడెంట్ బి.ఎన్. మంథా పత్రికా ముఖంగా హెచ్చరించింది కూడా అదే. సబ్జక్టులో ప్రావీణ్యం లేకుండా అమెరికా వెళ్ళటానికి ప్రయత్నించద్దు అని. జీతం రాకపోయినా ఏదైనా మంచికంపెనీలో ఇంటర్న్‌గా చేరి అనుభవం సంపాదించు. అప్పుడు అమెరికా వెడితే, నీకు మంచి అవకాశాలు వస్తాయి. నీ వల్ల ఆ కంపెనీలకి లాభం వుంటే నీ సత్తా కొద్దీ జీతం ఎక్కువిచ్చి ఉద్యోగం ఇస్తారు. ఎంత బాగా పనిచేస్తే అంత పైకి వెళ్ళగలుగుతావు. అంతే కాదు. ఒక కంపెనీ కాకపోతే ఇంకోటి. అవకాశాలు పెరుగుతాయి. ఇండియాలో మంచి కాలేజీల్లో చదువుకున్న వాళ్ళూ, చక్కటి తెలివితేటలూ సబ్జెక్టు వున్నవాళ్ళూ, అమెరికాలో ఉన్నత పదవుల్లో వున్నారు. అలాగే వీసాలిచ్చి బెంచీ మీద కూర్చోబెట్టే ఏజన్సీల్లో కూడా మంచివీ వున్నాయి. మోసం చేసేవీ వున్నాయి. వాటి గురించిముందుగానే క్షుణ్ణంగా మంచిచెడూ విచారించకపోతే, తర్వాత నిజంగానే విచారించవలసి వుంటుంది. ఇంతకు ముందు అమెరికా వెళ్ళిన నీ స్నేహితులనో,

తెలిసిన వారినో అడిగితే అసలు సంగతి బాగా తెలుస్తుంది. ఆలోచించుకో. నీ జీవితాన్ని నీ కంట్రోల్లో పెట్టుకో. డబ్బులు దోచుకుని డిగ్రీలమ్మే ఈ కాలేజీలనీ, వీసాల మోసగాళ్ళనీ, నీ జీవితంతో ఆడుకోనీయకు"

శేషగిరి శంకర్రావ్ చేతిని మృదువుగా నొక్కి, "థాంక్యూ!" అన్నాడు.

అని సూతుడు కథ చెప్పటం ముగించాడు.

కోతిపిల్ల కుంటుకుంటూ వెడుతుంటే, తల్లి కోతి అన్నది "ఎందుకూ కుంటుకుంటూ నడుస్తావ్. కింద పడలేదుగా"

కోతిపిల్ల కిచకిచా నవ్వి "అవును! పడలేదుగా!" అని, కుంటుకుంటూ నడవటం మానేసి, మళ్ళీ మర్రిచెట్టు ఊడలు పట్టుకుని వ్రేలాట్టం మొదలు పెట్టింది. ✿